

సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

# రైతులను నట్టేట ముంచడమే రేవంత్‌రెడ్డి లక్ష్యం

- ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయం
- సబ్బండ వర్గాల అభ్యున్నతి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం
- పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నెల్లికుదురు, నవంబర్ 13: 'రైతులకు కేవలం 3గంటల కరెంట్ చాలన్నాడు. ఇప్పుడు నీళ్లు, నిధులు, నియామకాల కోసమైతే అసలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే అవసరం లేదని అంటున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయం' అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని పార్వతమ్మగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇలాంటోడికి ఓటేస్తే మనం ఎంత గోసపడుతామో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులపై కనీస అవగాహన లేని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలను మనమే కొని తెచ్చుకున్నోళ్లం అవుతామన్నారు. నాడు రైతులు తమ పంటలకు నీళ్లందివ్వడానికి రాత్రి, పగలు పొలాలకు వెళ్లి పడరాని పాట్లు పడ్డారని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ రైతులకు 24 గంటల కరెంట్‌తో పాటు రైతుబంధు, రైతు బీమా సౌకర్యాలను కల్పించి గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నారని తెలిపారు. ధరణి పోర్టల్ అవసరం లేదంటున్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందన్నారు. ఉద్యమ స్ఫూర్తితో రైతులు, ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేశ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కే విజయ్ యాదవ్, నాయకులు ఎన్ రామచంద్రయ్య, జీ బిక్కునాయక్ పాల్గొన్నారు.

## పేద వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

గూడూరు, నవంబర్ 13: మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన కొట్టం కుసుమాంజలికి ఈ ఏడాది వైద్య విద్యలో సీటు వచ్చింది. పేద కుటుంబం కావడంతో ఉన్నత విద్య చదివే ఆర్థిక స్థోమత లేదు. దీంతో 1998-99 పదో తరగతి మిత్రులు, ఇతరులతో కలిసి రూ. 1.15 లక్షలను సేకరించి ఆదివారం కుసుమాంజలికి తల్లితండ్రుల సమక్షంలో అందజేశారు. బృంద సభ్యులు పేరాల రాము, సమ్మెట స్వామి, నరేశ్, ఎం శ్రావణ్, పూర్ణచందర్, శ్రీనివాస్, వెంకన్న, మహేందర్, శ్రీధర్‌శర్మ, సంపత్, మల్లయ్య, సతీశ్, ఇక్బాల్ పాల్గొన్నారు.



కుసుమాంజలికి నగదు అందజేస్తున్న మిత్రులు

# సీఎం కేసీఆర్ పాలనలోనే ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- మళ్లీ బీఆర్‌ఎస్‌దే ప్రభుత్వం
- అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు
- వ్యవసాయాన్ని పండుగ చేసింది కేసీఆరే..
- ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు
- జోరుగా బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం

కేసముద్రం, నవంబర్13: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరాయని ధన్నసరి సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ మండలంలోని ధన్నసరిలో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లు, కేసీఆర్ కిట్ వంటి పథకాలు పేదలకు లబ్ధి చేకూర్చాయన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా, సాగునీరు అందించడంతో రైతులు రెండు లేదా మూడు పంటలు సాగు చేస్తున్నారని గ్రామాల్లో ఉపాధి లభిస్తున్నదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్, ఎకరానికి రూ.16వేల పెట్టుబడి సాయం, ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా అందిస్తారని తెలిపారు. దళిత బంధు, బీసీ రుణాలు, గృహలక్ష్మి వంటి పథకాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. పేదలు, రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు మరోసారి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మంకు యాకూబ్‌రెడ్డి, వేం సంపత్‌రెడ్డి, బానోత్ శ్రీను, బుర్ర కుమారస్వామి, ఒంటెల ఉప్పల్‌రెడ్డి, ఎడ్ల రవీందర్‌రెడ్డి, సుంచు సూరయ్య, సట్ల వెంకన్న, లింగాల శ్రీను, సిరికొండ భాస్కర్, కొండ శ్రీను, తేజావత్ రాజేశ్, బోడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: గొడన్నకు మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కేసముద్రం: ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు

## శంకర్‌నాయక్ గెలుపుతోనే మరింత అభివృద్ధి

ఇనుగుర్తి : బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ గెలుపుతోనే నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని లక్ష్మీపురం సర్పంచ్ ఎల్దండ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేసి శంకర్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. బీఆర్‌ఎస్ పేదల పార్టీ అని, మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు ముత్యాల యాకయ్య, పల్ల రాము, గ్రామ సోషల్ మీడియా ఇన్‌చార్జి ముత్యాల దిలీప్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కాళోజీకి నివాళి

నెల్లికుదురు, నవంబర్ 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బంటు కవిరాజ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్‌కుమార్ లు మాట్లాడారు. ప్రశ్నించడం, ధిక్కారానికి పర్యాయపదం కాళోజీ అని, ఆయన తన కవిత్వంలో నాటి సమాజంలో తెలంగాణ ప్రజలు, భాషపై, సంస్కృతిపై జరుగుతున్న దాడిని, సమైక్య పాలనలో చూపిన వివక్షపై తన రచనల్లో తీవ్రంగా ఖండించారన్నారు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో అనేక రచనలు చేసి ఖ్యాతి గడించారన్నారు. తన కవితలతో పేదలు, తెలంగాణ ప్రజల ఆవేదన, ఆగ్రహాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. ఆయన రాసిన 'నా గొడవ' సంకలనంలో సమకాలిన సామాజిక సమస్యలను ఏకరువు పెట్టారని, తెలంగాణ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మహేందర్, సుధాకర్, యాకన్న, సతీశ్, స్పందన, అధ్యాపకేతర బృందం సైదా, ప్రదీప్, లక్ష్మణ్, గౌరీశంకర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కవిరాజ్

# ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకున్న వారిపై కేసు

గూడూరు, నవంబర్ 13: మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వాహనాన్ని అడ్డగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ సోమవారం తెలిపారు. ఆదివారం పొనుగోడు సర్పంచ్ నలమాస వెంకన్న దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చిన అనంతరం తిరిగి మహబూబాబాద్‌కు వెళ్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను ముగ్గురు యువకులు అయోధ్యపురం వద్ద అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకున్నారని ఎమ్మెల్యే గన్‌మెన్ లక్ష్మణ్ వారిని వారించేందుకు ప్రయత్నించగా గన్‌మెన్‌లను అనంతుల సందీప్, వానరాశి దుర్గాప్రసాద్, అన్నపురపు పవన్ దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలిగించారు. గన్‌మెన్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

గూడూరు, నవంబర్13: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, పార్టీల నాయకులు సహకరించాలని సీఐ ఫణీధర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి సీఐ ఆధ్వర్యంలో అయోధ్యపురం, పొనుగోడు, బొల్లేపల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఫణీధర్ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఏజెన్సీ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రజల్లో ధైర్యం నింపేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాణాప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

# కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు

గూడూరు: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి అనేక మంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖాసీం అన్నారు. సోమవారం మండలంలోని దామరవంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీరవెల్లి మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు, మహబూబాబాద్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, ప్రజల మద్దతు తమకే ఉన్నదని ప్రజలు మూడోసారి తమను దీవిస్తున్నారని తెలిపారు. గ్రామ గ్రామాన బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారని, తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే గెలిపిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, సర్పంచ్ ముక్కా లక్ష్మణ్‌రావు, తుల సీరాం, ఎంపీటీసీలు స్వాతీ రవి, బోడ కిషన్, గాదె వెంకట్‌రెడ్డి, మల్లేశ్, వీరన్న పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

# పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

కురవి, నవంబర్ 13: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బలపాల గ్రామంలో సోమవారం జరిగింది. కురవి ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రొయ్యల వీరన్న కుమారుడు వెంకటేశ్(29) చిన్నప్పటి నుంచి గార్లలోని తన అమ్మమ్మ వద్ద ఉంటూ కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. వారం క్రితం వారిద్దరి మధ్య గొడవ జరగడంతో బలపాలకు వచ్చాడు. ఏమి జరిగిందో తెలియదు కానీ.. ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అక్క కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.